దళితవాడల్లో వంద దేవాలయాల నిర్మాణం



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కాకాణి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : సర్వేపల్లి నియోజకవర్గంలోని దళిత వాడల్లో టీటీడీ సహకారంతో 100 దేవాలయాలు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పిడూరు దళితవాడలో టీటీడీ సహకారంతో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో కాకాణికి స్వాగతం పలుకగా ఆయన సీతారాములకు నూతన వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దైవభక్తికి ధనిక, పేద అనే తేడా ఉండదన్నారు. పేదలు నివాసముండే దళిత, గిరిజన కాలనీల్లో తమకు కూడా దేవాలయం ఉంటే బాగుంటుందని కోరుతున్నారని, వారి మనోభావాలు గౌరవించి టీటీడీ సహకారంతో ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 100 దేవాలయాలకు నిధులు మంజూరు చేయించి, ఇతరత్రా నిధులు సేకరించి నిర్మిస్తున్నట్లు తెలిపారు. పిడూరు దళితవాడలో రామాలయం కావాలని స్థానికులు కోరగా టీటీడీ ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. అయితే మాజీ సర్పంచ్ మన్నెమాల సాయి మోహన్‌రెడ్డి ఆలయాన్ని గొప్పగా నిర్మించాలన్న సంకల్పంతో గ్రామస్తుల సహకారంతో నిధులు సమీకరించి పెద్ద ఆలయం నిర్మించారని తెలిపారు. నియోజకవర్గంలోని ఏ దళితవాడలోనూ ఇంత బ్రహ్మాండమైన దేవాలయం లేదన్నారు. అంతకు ముందు సాయిమోహన్‌రెడ్డి తదితరులు మంత్రి కాకాణికి కొయ్యతో చేసిన వెంకటేశ్వరస్వామి ప్రతిమతో కూడిన చిన్న మండపాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటరమణారెడ్డి, మన్నెమాల నిరంజన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, గుమ్మడి వెంకటసుబ్బయ్య, దాసరి భాస్కర్‌గౌడ్, రామసుబ్బానాయుడు, నవకోటి, రవీంధర్‌రెడ్డి, రమేష్, మహేంద్రవర్మ, రమణయ్య, కోటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి

• నాబార్డ్ డీడీఎం రవిసింగ్



ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీడీఎం రవిసింగ్

ముత్తుకూరు : ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నాబార్డ్ డీడీఎం రవిసింగ్ అన్నారు. ముత్తుకూరులో గురువారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివిధ బ్యాంకులు అమలు చేసే పథకాలు, రిజర్వ్ బ్యాంకు అమలు చేసే పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాలు దోహదపడుతాయన్నారు. అలాగే, ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి తదితర పథకాలను ప్రచారం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ కో–ఆర్డినేటర్ బాబూరావు, నోడల్ ఆఫీసర్ సాయికుమార్, ఏపీఎం పెంచలబాబు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అక్బర్‌అలీ

వెంకటాచలం : దివ్యాంగులు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అక్బర్‌అలీ సూచించారు. మండలంలోని ఎర్రగుంట వద్దనున్న దివ్యాంగుల సంయుక్త ప్రాంతీయ కేంద్రంలో దివ్యాంగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రంలో టైలరింగ్‌కు సంబంధించి శారీరక వైకల్యం, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు అంధత్వం గల వారికి శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ నియామకాల్లోనూ తోడ్పాటు ఇస్తారని తెలియజేశారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మనోజ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం

పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఈనెల 20వ తేదీ మంగళవారం వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని దేవస్థానం చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి వెల్లడించారు. గురవారం శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. 16న శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం ఉంటుందన్నారు. 17న శనివారం ఉదయం హనుమంత వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు గరుడ వాహనంపై గ్రామోత్సవం, 18న ఆదివారం ఉదయం పల్లకిపై గ్రామోత్సవం, సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం, రాత్రి 7 గంటలకు గజవాహనంపై గ్రామోత్సవం, 19న సోమవారం ఉదయం వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై గ్రామోత్సవం, 20న మంగళవారం స్వామివారికి ఏకాంత సేవ, రాత్రి 8 గంటలకు అగ్నిగుండ మహోత్సవం ఉంటుందని తెలిపారు.

'దింసా' నృత్యంతో పాఠ్యాంశ బోధన



నృత్య ప్రదర్శన ఇచ్చిన విద్యార్థినులు, రూపకర్తలతో హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం

కొడవలూరు: మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్ జి.నాగభూషణం వినూత్న రీతిలో 'దింసా' నృత్య ప్రదర్శనతో పాఠ్యాంశ బోధన చేశారు. ఏడో తరగతి హిందీ పాఠ్యపుస్తకంలో విశాఖ జిల్లా అరకు ప్రజల సంస్కృతి సంప్రదాయాలపై పాఠ్యాంశం ఉంది. ఇది సులువుగా అర్థమయ్యేలా విద్యార్థినులకు దింసా నృత్యంపై శిక్షణ ఇచ్చి వారితో ప్రదర్శన ద్వారా గురువారం పాఠ్యాంశ బోధన చేశారు. కేవలం వినడం కంటే చూస్తూ వినడం(దృశ్య శ్రవణం) ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమవ్వడంతో పాటు ఎక్కువ కాలం గుర్తుండిపోతుందన్నారు. ఈ సందర్భంగా హిందీ పండిట్‌ను హెచ్ఎం జి.శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కట్టా సురేష్, శ్యామ్, మల్లికార్జునరావు, శివనాగబాబు, సుహాసిని, హసీనా పాల్గొన్నారు.

నేడు బుచ్చిలో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయా వార్డుల్లో నిర్మించిన సీసీరోడ్లు, డ్రెయిన్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వివరించారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

• పశువైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి

పొదలకూరు : మండలంలోని కోళ్ల ఫారాల్లో ఇటీవల వరుసగా మృతిచెందిన కోళ్ల శ్యాంపిళ్లను వైరాలజీ టెస్ట్ నిమిత్తం భోపాల్‌కు పంపిన నేపథ్యంలో ఉన్నత స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తమకు సూచించినట్లు తాటిపర్తి పశువైద్యాధికారి డాక్టర్ సి.మురళీకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కోళ్ల మృతికి బర్డ్‌ఫ్లూ కారణమనే నివేదిక తమకు ఇంకా అందలేదన్నారు. అయితే తమ శాఖ ఉన్నత స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడైనా నివేదిక రావచ్చని వెల్లడించినట్లు పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం మండలంలోని చాటగొట్ల గ్రామంలో సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో కోళ్ల పెంపకం దారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారికి పల్లకిసేవ చేశారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

జగనన్న ప్రభుత్వంలో గ్రంథాలయాల అభివృద్ధి



గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు(కోవూరు): కాలానుగుణంగా గ్రంథాలయాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, అందుకు మన జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కోవూరు పట్టణంలో రూ.35 లక్షల నిధులతో పునర్నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారదతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధి వల్ల విద్యార్థులు, విద్యావంతులు, మహిళలకు ఎంతో ఉపయుక్తమన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి రూ.5 లక్షల దాతృత్వంతో ముందుకు రావడం వల్లే గ్రంథాలయం ఆధునిక హంగులతో అత్యంత సుందరంగా మారిందన్నారు. 38 రకాల దిన, వార, పక్ష, మాస పత్రికలతో పాటు తెలుగు ఇంగ్లిష్, హిందీ ఉర్దూ భాషల్లో 18,631 పుస్తకాలు, 1,477 మంది ధరావత్తు సభ్యులు, 120 మంది రోజువారీ పాఠకులున్న గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు మరో రూ.30 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.

లైబ్రరీల్లో యూపీఎస్సీ మెటీరియల్స్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల్లో గడిచిన రెండేళ్లలో రూ.కోటి వెచ్చించి పుస్తకాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. పేద విద్యార్థుల కోసం లైబ్రరీల్లో యూపీఎస్సీ, గ్రూపు–1 మెటీరియల్స్ సైతం అందుబాటులో ఉందన్నారు. తన రెండేళ్ల పదవీ కాలంలో ఐదు లైబ్రరీలను పునర్నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎల్డీఏ, డీఏఏబీ చైర్మన్‌లు జి.విజయకుమార్, డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ కె.శ్రీలత, సర్పంచ్ విజయమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఆర్.మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ ఎస్.సుబ్బారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కె.దినేష్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్‌సీపీ కార్యాలయం

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఉప సర్పంచ్, జేసీఎస్ కన్వీనర్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీపీఆర్ కల్యాణ మండపం కింద భాగంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఉదయం 10 గంటలకు కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

మహిళల ఉపాధికి తోడ్పాటు

• ఎస్బీఐ జీఎం శ్రీనివాసులు



కుట్టు మెషీన్‌ను అందజేస్తున్న ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు

కొడవలూరు : సామాజిక బాధ్యతలో భాగంగా ఎస్బీఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటు అందిస్తోందని కొడవలూరు ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ పెయ్యల శ్రీనివాసులు తెలిపారు. ఎస్బీఐ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా కొడవలూరులోని ఎస్బీఐలో ఝాన్సీ లక్ష్మీబాయి పొదుపు గ్రూపు సభ్యురాలైన గాలి హెలీనాకు కుట్టు మెషీన్‌ను ఉచితంగా ఇచ్చారు. దీనిని బీఎం చేతుల మీదుగా గురువారం హెలీనాకు అందజేసి మాట్లాడారు. ప్రతి ఏడాది ఎస్బీఐ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పది మంది మహిళల ఉపాధికి సంబంధించి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ బ్యాంక్ క్యాష్ ఆఫీసర్ సీహెచ్.నిరంజన్‌కుమార్, అసోసియేట్ పి.ప్రసాద్, ఏపీఎం ఎస్.రుక్మిణి, సీసీ కె.ఉదయ్‌కుమార్, వీఓఏ జి.కవిత తదితరులు పాల్గొన్నారు.

కోడూరు కాలువలో వ్యక్తి మృతదేహం



తోటపల్లిగూడూరు : మూడు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం చింతోపు సమీపంలోని కోడూరు కాలువలో లభ్యమైంది. ఎస్సై జంపాని కుమార్ కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన పొన్నూరు ప్రసాద్(57) గత కొన్నేళ్లుగా నరుకూరులోని ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఆశ్రమం నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రసాద్ మిస్సింగ్‌పై ఫిర్యాదు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు గురువారం చింతోపు ఆంజనేయపురం సమీపంలోని కోడూరు కాలువలో ఓ మృతదేహాన్ని గుర్తించారు. ఇది అదృశ్యమైన ప్రసాద్ అని కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు.

భగవద్గీత పారాయణంతో జ్ఞాన సముపార్జన



అష్టలక్ష్మి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న దత్తవిజయానందతీర్థస్వామి



పూజల్లో పాల్గొన్న భక్తులు

• మైసూరు దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు దత్త విజయానందతీర్థస్వామి

నెల్లూరు(బృందావనం): భగవద్గీత పారాయణంతో జ్ఞాన సముపార్జన కలుగుతుందని, తద్వారా విచక్షణతో జీవనం సాగించగలమని మైసూరు దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు విజయానందతీర్థస్వామి అనుగ్రహ భాషణ చేశారు. నగరంలోని సుజాతమ్మకాలనీలో ఉన్న అవధూత దత్తపీఠం–నెల్లూరు శాఖకు చెందిన శ్రీకృష్ణయోగ, అష్టలక్ష్మి మందిరంలో శ్రీసూక్త యాగం, శ్రీచక్రార్చనను గురువారం నిర్వహించారు. స్వర్ణాంబిక స్వర్ణమహాలక్ష్మికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా దత్త విజయానందతీర్థస్వామి భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ భగవద్గీత విశిష్టతను వివరించారు. ప్రతిజీవికి జ్ఞానం ఎంతో ప్రధానమన్నారు. అకారణంగా జీవులపై ద్వేషం తగదన్నారు. తోటి వారిపై ద్వేషాన్ని వీడాలన్నారు. భగవన్నామస్మరణతో ద్వేషం దరిచేరదన్నారు. భగవన్నామస్మరణతో భక్తి, ముక్తిని పొందాలన్నారు. భగవన్నామస్మరణ భజనలతో ఆరోగ్యం ఒనగూరుతుందన్నారు. దత్తపీఠాధీశ్వరులు గణపతి సచ్చిదానందస్వామికి నెల్లూరు ఆశ్రమమంటే ఎంతో ఇష్టమని, ఆయన అనుగ్రహంతో రథసప్తమి పూజలు నిర్వహించేందుకు ఆగమనం చేశామన్నారు. గణపతి సచ్చిదానందస్వామి రచించిన దివ్యనామ సంకీర్తనలను ఆలపించిన బాలలు, వారికి శిక్షణ ఇచ్చిన సర్వేపల్లి సోదరీమణులు శ్రేయ,రాజ్యలక్ష్మికు మంగళాశాసనాలు అందించారు. ప్రతి ఏకాదశి నాడు శ్రీకృష్ణ మందిరం ప్రాంగణంలోని శ్రీకృష్ణభగవానుని సన్నిధిలో భగవద్గీత పారాయణం నిర్వహించి విద్యార్థులను ఉన్నతపౌరులుగా తీర్చిదిద్దాలని గురువు షేక్ నజీర్‌బాషాగురూజీకి దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు సూచించారు. అనంతరం భగవద్గీత పారాయణం, భజన పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎస్కేజీబీఎస్ ట్రస్ట్ ఎగ్జిక్యూటీవ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు రేబాల పట్టాభిరామిరెడ్డి, అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి, పచ్చిపాల ప్రమీలమ్మ, మస్తాన్‌రెడ్డి, సీసీ రత్నం, ప్రవీణ్‌కృష్ణ,సురేష్‌కొల్లం,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి పూజలు

రథసప్తమి సందర్భంగా అష్టలక్ష్మి మందిరంలో శనివారం ఉదయం 6గంటలకు దత్తవిజయానందతీర్థ స్వామి స్వహస్తాలతో రథసప్తమి పూజ, ఆదిత్య హృదయ పారాయణం, 10గంటలకు శ్రీచక్రార్చన, మహాసౌర హోమం, సాయంత్రం 5గంటలకు సరస్వతీపూజ ,6గంటలకు దివ్యనామ సంకీర్తన, తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

చింతలపాళెం వలంటీర్‌కు సేవావజ్ర



జెడ్పీ చైర్‌పర్సన్ నుంచి అవార్డు అందుకుంటున్న పవన్‌కుమార్

వెంకటాచలం: మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధి చింతలపాళెం వలంటీర్ పవన్ కుమార్ సేవలకు గుర్తింపుగా సేవావజ్ర అవార్డుకు ఎంపికయ్యారు. నెల్లూరు నగరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

నేటి నుంచి పుష్కర కుంభాభిషేక ఉత్సవాలు

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు పుష్కర కుంభాభిషేకం మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. తొలిరోజు మహాగణపతిపూజ, తీర్థ సంగ్రహణం, విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 17న అష్టబంధన సమర్పణ, విశేష సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత సర్వమంత్ర హోమం, జంట నాగదేవతలకు అభిషేకం, మంగళహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న రుద్ర హోమం, పూర్ణాహుతి, ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 36 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శిల్పానికి మహాకుంభాభిషేక పూజలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, మయూర వాహన సేవ ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంలో భాగంగా 2024 – 25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ప్రవేశానికి cse.ap.gov.inలో ఈ నెల 23 నుంచి వచ్చే నెల్లో 14లోపు నమోదు చేసుకోవాలని డీఈఓ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, హెచ్ఐవీ బాధిత, దివ్యాంగ పిల్లల కోసం ఐదు.. ఎస్సీలకు 10.. ఎస్టీలకు నాలుగు.. బలహీన వర్గాలకు ఆరు శాతం మేర సీట్లను కేటాయించారని చెప్పారు. అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయించనున్నారని వివరించారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘ ఎన్నిక



ముక్కు రాధాకృష్ణగౌడ్

నెల్లూరు(బారకాసు): రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడిగా ముక్కు రాధాకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో గురువారం జరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కోడూరు ధనేష్‌నాయుడు, కార్యదర్శిగా దామెర్ల శివప్రసాద్, సహాయక కార్యదర్శిగా గంజం పెంచలప్రసాద్, కోశాధికారిగా కోసూరు వెంకటసుధీర్, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ నరేష్‌యాదవ్, తాళ్ల పెంచల్‌కుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్ల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

టిడ్కో గృహాల పంపిణీ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించే ప్రక్రియను గురువారం మధ్యాహ్నం నుంచి యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. ఇందుకోసం కార్పొరేషన్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి వచ్చిన వారికి గృహాలను స్వాధీనం చేశారు. ఈ ప్రక్రియను పక్కా ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

సమాజసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

నెల్లూరు రూరల్: సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని విక్రమ సింహపురి వర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి అన్నారు. బుజబుజనెల్లూరు సమీపంలోని బురాన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెల్లూరు జీవీఆర్ఆర్ కళాశాల నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా జయభారత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవాదృక్పథంతో పనిచేయాలన్నారు. అనంతరం వైద్యుడు ఓబులేషు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జాకీర్, స్థానిక పాఠశాల హెచ్ఎం నరసింహారావు, జీవీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.